# మహాభారతసారసంగ్రహము

పుల్లెల శ్రీరామచంద్రుడు

2014

# మహాభారతసారసంగ్రహము

పుల్లెల శ్రీరామచంద్రుడు

2014

# మహాభారతసారసంగ్రహము

---

© **కాపీ రైటు హక్కులన్నీ రచయిత శ్రీపుల్లెల శ్రీరామచంద్రుడువి.**

ప్రథమ ముద్రణము : **2012**

ద్వితీయ ముద్రణము : **2012**

తృతీయ ముద్రణము : **2014**

వెల :

ప్రకాశకులు : **శ్రీమతి పుల్లెల సుబ్బలక్ష్మి**
'నందనం', 8-2-603/1/VP, ప్లాట్ నెం. 8ఎ,
రోడ్ నెం. 10, బంజారాహిల్స్,
హైదరాబాద్ - 500 034.

ప్రతులకు : **1. శ్రీ జయలక్ష్మి పబ్లికేషన్స్**
2-22-311/97సి, వెస్టర్న్ హిల్స్,
కూకట్‌పల్లి, హైదరాబాద్-500 085
ఫోన్: 040-23050986

**2. సంస్కృతభాషా ప్రచార సమితి**
5-4-743/సి, హరేకృష్ణ దేవాలయం ప్రక్కన,
నాంపల్లి స్టేషన్ రోడ్, అబిడ్స్,
హైదరాబాద్ - 500 001.
ఫోన్: 040-24615481

డిటిపి : **సమంత గ్రాఫిక్స్**
ఎస్.ఆర్.టి. 8, జవహర్‌నగర్,
హైదరాబాద్ - 500 020.
ఫోన్ : 040-27670198

ముద్రణ : **సంహిత గ్రాఫిక్స్**
అమీర్‌పేట్, హైదరాబాద్-500 016
ఫోన్: 040-23731620

**శ్రీః**

**ఓం స్వస్తి శ్రీగణేశాయ నమః**

**శ్రీశఙ్కరభగవత్పాదాః విజయన్తే**

# ప్రస్తావన

## 1

ప్రపంచవాఙ్మయంలోనే సాటి లేని అత్యద్భుత మైన ఇతిహాసం **మహాభారతం**. ప్రామాణ్యంచేతా, లోకప్రియత్వంచేతా దీనితో సమానమే అయినా **వాల్మీకిరామాయణం** ప్రమాణంచేత దీనికంటె చిన్నది. రామాయణంలోని శ్లోకాల సంఖ్య ఇరవైనాలుగు వేలు. భారతంలోని శ్లోకాల సంఖ్య ఒక లక్ష. **హరివంశం**తో కలిపితే మహాభారతశ్లోకాల సంఖ్య ఒక లక్ష ఇరవైఐదు వేలు; సపాదలక్ష. దీనిని పట్టే తెలుగులో 'సవాలక్ష గ్రంథం' అను నానుడి ప్రసిద్ధిలోనికి వచ్చింది.

మానవునిలో హృదయపక్షమూ, శిరఃపక్షమూ అను రెండు పక్షా లుంటాయి. స్నేహము, దయ, ప్రేమ, భక్తి, సోదరప్రేమ, దేశప్రేమ, పెద్దలయందు భక్తి - ఇవన్నీ హృదయపక్షానికి చెందినవి. ఆలోచనాశక్తి, నైతికప్రవృత్తి, కార్యనిర్వహణచాతుర్యము, సదసద్వివేకము, క్లేశాలను అధిగమించే నేర్పు ఇలాంటి వన్నీ శిరఃపక్షానికి చెందినవి. ఈ రెండింటికీ సమాన మైన పరిపుష్టి కలిగినప్పుడే మానవుడు పరిపూర్ణమానవు డవుతాడు.

**రామాయణం** మానవుని హృదయపక్షానికి పరిపుష్టిని చేకూర్చే గ్రంథమైతే, **మహాభారతం** శిరఃపక్షాన్ని పరిపుష్టం చేసే గ్రంథం. ఈ విధంగా - **రామాయణం** భారతీయుల హృదయం; **భారతం** శిరస్సు. ఈ రెండింటినీ సమంగా ఆదరిస్తూ వాటివల్ల లాభం పొందేవాడు యథార్థమైన భారతీయుడు.

**"సౌభ్రాత్రసౌహృదముఖాన్ హృదయస్య ధర్మాన్**
**ఆబధ్య ధీపరిణతీరుత రాజనీతీః,**
**దేశస్య యే హృదయశీర్షతయా చకాస్తః**
**రామాయణం తదథ భారతమేష వన్దే."**

**'ఇలియడ్', 'ఒడిస్సీ'** అనేవి మా అత్యద్భుత మైన ప్రాచీనేతిహాసగ్రంథాలు అని పాశ్చాత్యులు చెప్పుకొంటూంటారు. ఐతే వాటి పఠనపాఠనా లేవీ ఇప్పు డున్నట్లు కనబడదు. ప్రచారం అసలే లేదు. ఆ రెండూ కలిపితే ఎంత గ్రంథం అవుతుందో దానికి ఎనిమిది రెట్లు ఉంటుంది లక్షశ్లోకాల **భారతం.** ఇది వ్యాసుని ముఖంనుండి ఆవిర్భవించినది

మొదలు దీని పఠన – పాఠన – శ్రవణాలు, అనేకరూపాలలో దీనిలోని కథల ప్రచారము, సాంస్కృతికబోధల ఆచరణమూ నిరంతరమూ ఈ భారతదేశం అంతటా జరుగుతూనే ఉన్నాయి. **రామాయణమహాభారతాలు** లేని భారతదేశస్వరూపాన్ని ఊహించడం కూడ అసంభవం.

## 2

ప్రతి ఒక్కరూ, ధర్మము, అర్థము, కామము, మోక్షము అనే నాలుగు లక్ష్యాలను సాధించుకొని తమకు లభించిన మానవజన్మను సార్థకం చేసికోవా లనేది **రామాయణ – భారతాలు**, పురాణాలు, వాటిలోని విషయాలను గ్రహించి రచించిన కావ్యనాటకాదులు చేసే ప్రధాన మైన ఉపదేశం. ఈ నాల్గింటికీ పురుషార్థచతుష్టయం అని పేరు.

తన జీవనవిధానంలో ఏ నియమాలను పాటించడంచేత, ఏ దోషాలను పరిహరించడంచేత, మానవుడు సుఖంగా ఉంటాడో, తనవంటి మానవులకే కాక ఇంకా ఎన్నో వేల జాతుల ప్రాణులకు నెలవైన ఈ లోకంలో శాంతిసుఖాలను నెలకొల్ప కలుగుతాడో, దేని ద్వారా చివరికి దుఃఖలేశం కూడ లేని ఆనందమయస్థితిని పొందకలుగుతాడో అది ధర్మం. ఈ ఆనందమయస్థితియే మోక్షం. మధ్యలో ఉన్న అర్థ – కామాలు మానవుని జీవితంనుంచి విడదీయరానివి. మానవుడు తన మనుగడకు ఆవశ్యక మైన వస్తువులను సంపాదించుకొనడం అర్థం. వాటిపై ఇచ్ఛ కామం.

ధర్మ – అర్థ – కామాలలో ప్రధాన మైనది ధర్మమే అనేది రామాయణభారతాదులు చేసే బోధ.

**"రామో విగ్రహవాన్ ధర్మః"** (రాముడు మూర్తీభవించిన ధర్మం) అని చెప్పబడిన రాముడు **రామాయణం**లో నాయకు డైతే, ధర్మదేవుని అంశావతార మైన (ఈ విషయం మున్ముందు స్పష్టం చేయబడుతుంది) యుధిష్ఠిరుడు **మహాభారతం**లో నాయకుడు.

యుధిష్ఠిరుణ్ణి నాయకునిగా చేయడం ద్వారా, **మహాభారతం** ధర్మోపదేశప్రధాన మైన గ్రంథం అను విషయం సూచించిన వ్యాసుడు, మధ్య మధ్యలో కూడ అనేక స్థలాలలో ధర్మాని కున్న ప్రాధాన్యాన్ని స్పష్టీకరిస్తూ చివరికి ధర్మవైశిష్ట్యాన్ని మాటలలో కూడ విశదంగా ప్రతిపాదిస్తూ ఈ మహేతిహాసాన్ని ముగించాడు.

"నేను చేతులు పైకెత్తి – 'ధర్మం విషయంలో శ్రద్ధ వహిస్తే అర్థ – కామాలు వాటంతట అవే చక్కబడతాయి. అలాంటి ధర్మాన్ని మీరందరూ ఎందుకు సేవించరు?' అని ఎలుగెత్తి అరుస్తూ చెపుతున్నాను; ఎవ్వడూ నా మాట వినడంలేదు" అంటాడు.

**ఊర్ధ్వబాహుర్విరౌమ్యేష న చ కశ్చిచ్ఛృణోతి మామ్,**
**ధర్మాదర్థశ్చ కామశ్చ స ధర్మః కిం న సేవ్యతే.** (స్వర్గారోహణపర్వం 5.62)

"కామంచేత గాని, భయంచేత గాని, లోభంచేత గాని, చివరికి ప్రాణాలు రక్షించు కొనడానికి గాని ఎన్నడూ ధర్మాన్ని విడవగూడదు. ఎందువల్ల ననగా – ధర్మం నిత్యమైనది; సుఖదుఃఖాలు అనిత్యమైనవి. జీవుడు నిత్యుడు; జీవత్వానికి హేతు వైన అవిద్యాసంబంధం అనిత్యం" అని కూడ అంటాడు –

**న జాతు కామాన్న భయాన్న లోభాద్**
**ధర్మం త్యజేజ్జీవితస్యాపి హేతోః,**
**నిత్యో ధర్మః సుఖదుఃఖే త్వనిత్యే**
**జీవో నిత్యో హేతురస్య త్వనిత్యః.** (స్వర్గారోహణపర్వం 5.63)

"ఇలా చేస్తే పుణ్యం లభిస్తుంది"; "అలా చేస్తే పాపం వస్తుంది" అంటూ విధి – నిషేధవాక్యాల ద్వారా పది మాటలలో ధర్మాధర్మాలను గూర్చి బోధించవచ్చు. కాని ఇలాంటి బోధలు శ్రోతల మనస్సులలో స్థిరంగా ఉండవు. "ఇలా చేయడంచేత ఇతడు ఈ విధంగా సుఖం పొందాడు, అలా చేయడంవల్ల అతడు ఆ విధంగా కష్టాల పాలయ్యాడు" అని అంటూ అన్వయోదాహరణాలతోను, వ్యతిరేకోదాహరణలతోను చేసిన బోధ శ్రోతల హృదయాలలో బాగా నాటుకొంటుంది. ఇలాంటి ధర్మబీజాలు, చిన్నతనంలోనే బాలుల హృదయాలలో నాటితే ఆ జీవితాంతం స్థిరంగా ఉంటాయి. ఇతిహాస – పురాణాదులు చేసే పని ఇదే; అందుచేతనే మన ఉన్నత మైన సంస్కృతిని రక్షించుకొనడంలో వాటి కంత ప్రాధాన్యం.

ఇలాంటి గ్రంథాలలో **భారతానికి** భారతమే సాటి. ప్రధానమైన కౌరవపాండవుల కథతో పాటు ప్రసంగవశంచేత అనేకమైన కథలూ, ఉపాఖ్యానాలూ చేర్చడంచేత దీని కింత వైశిష్ట్యం లభించింది. అందుచేతనే ఇది ఎన్నో వేల సంవత్సరాలుగా భారతీయుల ఆలోచనాపద్ధతినీ, జీవనవిధానాన్నీ ప్రభావితం చేస్తూ వస్తూన్నది.

## 3

దీనిలో తమ కాలానికి చెందిన ఆచారవ్యవహారాలకు విరుద్ధ మైన ఏవైన అంశా లున్నా, అతిశయోక్తు లున్నా వాటి కంత ప్రాధాన్యం ఇవ్వకుండా సార్వకాలికా లైన ధర్మాలనే గ్రహిస్తూ భారతీయులు తమ భారతీయత్వాన్ని సార్థకం చేసుకొంటూ తమ సాంస్కృతికైకత్వాన్ని పరిరక్షించుకొంటున్నారు; భారతసమైక్యాన్ని కాపాడుకొంటున్నారు.

మనం పైన చూచిన చతుర్విధపురుషార్థాలు ప్రతీ మానవుడూ తన జీవిత ప్రధానలక్ష్యంగా ఉంచుకొని సాధించవలసిన అర్థాలు, అనగా ప్రయోజనాలు. వాటి సాధనకై ఉపయోగించే ఆవశ్యకసాధనాలు వర్ణచతుష్టయధర్మాలు, ఆశ్రమచతుష్టయధర్మాలు, చతుర్విధ వృత్తులు (జీవనవిధానాలు) మొదలైనవి. **మహాభారతం**లో అడు గడుగునా వీటికి సంబంధించిన ఉపదేశాలు, సంవాదాలు కనబడతాయి.

సాధ్య మైన, ప్రధానలక్ష్య మైన, పురుషార్థచతుష్టయంలో ఎలాంటి మార్పులకు అవకాశం లేకపోయినా సాధనాలైన వర్ణ – ఆశ్రమధర్మాదులలో దేశకాలానుసారంగా ఎన్నో సర్దుబాట్లు జరుగుతూనే ఉంటాయి. వర్ణవ్యవస్థ గాని, వర్ణాల వృత్తులకు సంబంధించిన నియమాలు గాని, ఆశ్రమధర్మాలు గాని, నూటికి నూరు పాళ్లు ఏ కాలంలోనూ కూడ అనుసరించబడ లేదను విషయం ఇతిహాసపురాణాదులను ధర్మశాస్త్ర గ్రంథాలను, భారతదేశచరిత్రగ్రంథాలను జాగర్తగా పరిశీలిస్తే స్పష్టంగా తెలుస్తుంది.

(ఈ విషయా లన్నీ **'హిందూమతం, కొన్ని ఇతరమతాలు'** అను గ్రంథంలో సవిస్తరంగా చర్చించడం జరిగింది. ఇక్కడ చర్వితచర్వణం చేయడం అనావశ్యకం).

చాతుర్వర్ణ్యస్వరూపాన్ని గూర్చి **మహాభారతం**లో అనేక స్థలాలలో ప్రశ్నోత్తర రూపంలో విస్తృతమైన చర్చ కనబడుతుంది. యథాసంభవంగా ఆ విషయా లన్నీ ఈ గ్రంథంలో చేర్చడం జరిగింది.

## 4

**భారతం** అను పేరు వినగానే ఈ గ్రంథాన్ని చదివే అవకాశం లభించక దీనిలోని కథ మాత్రమే స్థూలంగా విన్న కొందరు, తమ కాలానికి విరుద్ధంగా ఉన్నట్లు కనబడే కొన్ని కథాంశాలను గూర్చి విమర్శిస్తూ, ఇవే **భారతం** లోని విషయాలు అన్నట్లు ఆ విషయాలే ముచ్చటిస్తూ, ఈ గ్రంథంవల్ల పొందదగిన ఉత్తమప్రయోజనా లేవీ పొందలేకుండా ఉన్నారు. వీరు విమర్శించే కొన్ని విషయాలు ఇవి –

1. వ్యాస – కర్ణ – పాండవాదుల ఉత్పత్తి.
2. ద్రౌపదికి ఐదుగురు భర్త లుండడం.
3. పశుపక్ష్యాదులను బలు లిచ్చే యజ్ఞాదులు.
4. కొందరు వందల కొలది వేల కొలది సంవత్సరాలు జీవించినట్లు కథలు.
5. తపస్సు, మంత్రాదులు మొదలైనవాటికి ఊహింపరాని శక్తు లున్నట్లు నమ్మకం.

6. అస్త్రశస్త్రాదులు.

7. ద్రోణాదులు కుంభాదులనుండి పుట్టినట్లు అసంభవమైన కథలు.

8. మానవులకు దేవతలతోను, వాళ్ల లోకాలతోను ప్రత్యక్ష సంబంధాలు.

9. ఇంకా ఎన్నో అతిశయోక్తులు.

10. వర్ణవిభేదాదులు.

ఒక కాలంలో ఒక ప్రదేశంలో పుట్టి అక్కడనే జీవిస్తూ ఆనాడు అక్కడ నున్న ఆచార వ్యవహారాదులతోను తమ చుట్టుప్రక్కల నున్నవాళ్ల శక్తి సామర్థ్యాదులతోను మాత్రమే పరిచయం ఉన్నవారికి సుదూరదేశకాలాదులకు సంబంధించిన సమాజంలో ప్రచారంలో ఉండే ఆచారవ్యవహారాదులను గూర్చి, వాళ్ల శక్తిసామర్థ్యాలను గూర్చి తెలియడానికి అవకాశం లేకపోవడంచేత ఇలాంటి ఆశంకలు, ఆక్షేపణలు కలగడం సహజమే.

అత్యద్భుతమైన వైజ్ఞానికాభివృద్ధిచేత మన దేశంలోనే ఈనాడు చూస్తూన్న పరిస్థితులను, సామాజికపరివర్తనాదులను రెండు – రెండున్నర వందల సంవత్సరాలకు పూర్వం ఉన్న మన పూర్వులు ఎవ్వరూ ఊహించి కూడ ఉండరు. ఇలా ఉండబోతుం దని ఎవరైనా చెప్పినా కూడ నమ్మి ఉండేవారు కాదు; అలా ఎవరైనా చెపితే వానిని ఉన్మత్తునిగా భావించేవారు.

ఈ పరిస్థితులు ఇలాగే ఉంటా యని నమ్మడానికి వీలు లేదు. మూడునాలుగు వేల సంవత్సరాల తరవాత ఇంకా అనూహ్యమైన అభివృద్ధి కలిగితే అప్పటివాళ్లు మనలను అనాగరికు లంటారు. ఇదంతా నశించి, భవిష్యత్తులో ఎవరైన గ్రంథాదులసహాయంచేత ఇప్పటి స్థితినిగూర్చి వర్ణించి చెప్పితే అప్పుడు వాళ్లు వానిని మూఢవిశ్వాసాలతో నిండిన మూర్ఖుడు అని నిందిస్తారు.

అందుచేత కొన్నివేల సంవత్సరాలక్రితం సుదూరదేశంలో ఉన్న పరిస్థితులను, ఆనాటి సామాజికవిశ్వాసాలను, వాళ్లు నమ్మిన జీవితపు విలువలను, దేశస్వరూపాన్నీ అర్థం చేసుకోవాలంటే మనం భావనాబలంతో (by imagination) ఆ దేశకాలాలలోనికి వెళ్లి చూడాలి; అప్పుడు చాలవరకు ఈ ఆశంక లన్నింటికీ సమాధానాలు దొరుకుతాయి.

మానవుని మనస్సు కున్న శక్తి అనూహ్య మైనది. మనస్సును యోగాభ్యాసాదులచేత నియంత్రించుకొని తపస్సు చేస్తే మానవునికి అత్యద్భుతమైన శక్తి లభిస్తుంది అని మన ప్రాచీనగ్రంథాలు సోదాహరణంగా చెపుతున్నాయి. అలాంటి తపోబలంచేత ఏమైనా సాధించవచ్చు నని విశ్వసించాలి. పరాశరాదులు అలాంటి తపస్సంపన్నులు లక్షమందిలో ఒక్క రుండడం కూడ కష్టం. ఆ విషయాన్ని మనం నమ్మితే పైన చెప్పిన ఆశంకలు చాల

వరకు తొలగిపోతాయి. వాళ్లు, అన్ని పనులూ లోకక్షేమంకోసమే చేశా రని అనుకొంటే అసంగతి ఏమీ ఉండదు.

ఈ కాలంలో ఇంతటి వైజ్ఞానిక ప్రగతిని సాధించిన వైజ్ఞానికులు కూడ మహాతపః శాలులైన ఋషులే. వీళ్ల తపస్సు ఒక మార్గంలో ఉంటే ప్రాచీనకాలానికి చెందిన ఋషుల తపస్సు మరొక విధంగా ఉండేది. వీళ్లు సాధించినదానిని సామాన్యమానవుడు అర్థం కూడ చేసికొనజాలడు.

తపస్సు తరువాత మానవులకు గొప్ప శక్తి నిచ్చేది మంత్రం. మంత్రాని కంత శక్తి ఉన్నట్లు దానిని సంపాదించినవాళ్లు, ప్రత్యక్షంగా చూచినవాళ్లు చెపుతూన్నప్పుడు కాదనడం అంత యుక్తం కాదు. ఆ మంత్రశక్తిచేత జరిగినదే పాండవద్రోణాదిజననం. స్పర్శమాత్రం చేత గాని, దృష్టిప్రసారమాత్రంచేత గాని సంతానం కలిగించగల శక్తి దేవతల కున్న దని వ్యాసుడు (ఆశ్రమవాసికపర్వం) లో చెప్పి ఉన్నాడు.

**ఈమధ్య చూపులచేతనే టి.వి.లను నియమించే విధానం కనుగొన్నట్లు పత్రికలలో ప్రకటింపబడింది (హిందూ. 3.9.2012).**

కృత్రిమగర్భోత్పత్త్యాదులు, క్లోనింగ్ జరిగే ఈ కాలంలో ఉన్న మనం స్కంద – ద్రోణ – దుర్యోధనాదుల ఉత్పత్తి అసంభవం అనడం అసంగతమే అవుతుంది.

యజ్ఞ – యాగాలు, పశుబలులు పూర్వకాలం అన్ని దేశాలలోను ఏదో ఒక రూపంలో ఉండేవి. బకిరీదువంటి పర్వాలలో ఈనాడుకూడ ఎన్ని జంతువులు, గోవులు, ఒంటెలు, గొఱ్ఱెలు మొదలైనవి బలి ఇస్తుంటారో తెలియని వాళ్లెవరూ లేరు.

చాలకుడు లేని విమానాల (డ్రోన్‌ల) ద్వారా, రాకెట్ల ద్వారా, ఎంతో దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలిగినట్లు చూస్తూన్న మనం అర్జునాదుల అద్భుతమైన శస్త్రాస్త్ర ప్రావీణ్యాన్ని అంగీకరించవలసి ఉంటుంది. అర్జునుడు సైంధవుని శిరస్సు ఖండించి ఎక్కడో కొన్ని క్రోశుల దూరంలో ఉన్న వాని తండ్రి చేతిలో పడే టట్లు చేయగలిగా డంటే అసంభావ్యం ఏమీ లేదు.

స్త్రీకి ఒకే భర్త ఉండాలి అను సాధారణనియమం ఉన్నా దానికి అపవాదలు ఆ కాలంలో కొన్ని ప్రాంతాలలో ఉండి ఉండవచ్చు. అందుచేతనే వ్యాసాదులు అంగీకరించారు. ఈ నాటికి కూడ అలాంటి ఆచారాలు భారతదేశంలోనే అక్కడక్కడ ఉన్నా యని అంటారు. అన్న మరణించగా వాని భార్యను సోదరుడు వివాహం చేసికొనే ఆచారం ఇప్పటికి కూడ రాజస్థాన్ మొదలైన ప్రాంతాలలో ఉన్న దని వినికిడి. మన ప్రక్కనే ఉన్న కేరళలో మొన్నమొన్నటి వరకూ ఉన్న ఆచారాలే మనకు విడ్డూరంగా కనబడతాయి.

కులధర్మాలు, ప్రాంతధర్మాలు, మొదలైనవాటిని రాజు జాగర్తగా పాలించా లని ధర్మశాస్త్రగ్రంథాలు, మహాభారతాదులు కూడ స్పష్టంగా బోధిస్తున్నాయి.

చెప్పదలచిన విషయాన్ని నొక్కి చెప్పడం కొరకై అతిశయోక్తులు వాడడం అన్ని వాఙ్మయాలలోను ఉన్నది. లౌకికసంభాషణాదులలో కూడ అడుగడుగునా కనబడుతుంది. భారతీయవాఙ్మయంలో దీని పాలు ఎక్కువ కనబడుతుంది. చిన్న పాపం చేసినా రౌరవనరకం వస్తుందనీ, చిన్న పుణ్యం చేసినా స్వర్గం వస్తుం దనీ చెపుతూంటారు. ఒక వ్రతాన్ని గూర్చి చెప్పి ఇది చేస్తే కనకవర్షం కురుస్తుంది అంటారు. ఇదే అన్ని వ్రతాలలోకీ గొప్పది అని ప్రతి ఒక్క వ్రతాన్నీ ప్రశంసిస్తారు. ఇవి కేవలం మానవుణ్ణి ఆ మంచిపని వైపు అభిముఖుని చేయడానికీ, చెడ్డ పనులనుండి విముఖుని చేయడానికీ చెప్పే మాటలు. ఉదాహరణకి –

**స్కన్ధే కవాటే పాషాణే ఆర్ద్రవస్త్రం న నిక్షిపేత్,**
**అథవా నిక్షిపేన్మూఢః రౌరవం నరకం వ్రజేత్.** అని ఒక శ్లోకం ఉంది.

తన భుజంమీద గాని, తలుపుమీద గాని, రాతిమీద గాని తడిగుడ్డ ఉంచకూడదు. అలా ఉంచినవాడు రౌరవనరకానికి వెడతాడు అని దీని అర్థం.

ఇదేమీ పాపకృత్యం కాదు. అలా ఉంచుతే అనారోగ్యాదు లేమైన కలుగుతా యని దానిని నిషేధించడం ప్రధానోద్దేశ్యం.

పురాణాలలోను, వేదాలలోను ఇలాంటి వాక్యాలు కోకొల్లలు. వాటి తాత్పర్యార్థమే గ్రహించాలి గాని, వాచ్యార్థం గ్రహించకూడదు.

అతిప్రాచీన మైన పూర్వమీమాంసాశాస్త్రంలో ఇలాంటి వాక్యాలకు అర్థవాదలని పేరు పెట్టబడింది.

'ఈ పని చెయ్యాలి' అని చెప్పి చేయమన్నది చేస్తే ఏదో చాలా గొప్ప లాభం కలుగుతుం దని, 'ఇలా చేయకూడదు' చెప్పి వద్దన్నది చేస్తే చాల కష్టం, లేదా పాపం కలుగుతుం దని చెప్పే మాటలకు అర్థవాద లని పేరు. వాస్తవానికి వాటివల్ల అంత లాభనష్టాలు కలిగే అవకాశం ఉండదు. ఇవన్నీ అర్థవాద లని ఆ శాస్త్రం చెపుతూన్నది. ఇవి, అనేకవస్తువులు, మందులు మొదలైనవాటిని గూర్చి ప్రకటిస్తూ (అడ్వర్టైజ్ చేస్తూ) పత్రికలు, టివి మొదలైనవాటిలో చెప్పే మాటల వంటివి.

దయామయు లైన కొంతమంది ఎలాగో ఆసుపత్రులలోనికి ప్రవేశించి అక్కడ ఉన్న రోగులకు రెండు రకాల కాగితాలు చేతిలో పెట్టి "మీ కోసం మేం ప్రార్థనలు

చేస్తున్నాం; ఈ పుస్తకం మీ తలక్రింద పెట్టుకొని పడుకోండి, మా దేవుణ్ణి (దేవుని విషయంలో 'మా' 'మీ'లు ఏమిటో!) ప్రార్థించండి; మీ రోగం క్షణంలో మాయమైపోతుంది" అని బోధిస్తున్నారట. వాళ్లు బోధించినట్లు అలాంటి దేదీ జరుగుతూన్నట్లు లేదు. ఇది అభూతాతిశయోక్తి కాకపోతే మరేమిటి! ఆడం – ఈవుల సంతానం అంతా పాపాత్ములే అయినప్పుడు ఒక పాపాత్ముడు మరో పాపాత్ముణ్ణి ఎలా ఉద్ధరిస్తాడు? ఇదంతా నిజమైతే చికిత్సాలయాలతో పని లేదు కదా! అప్పుడు – విద్యమీద, వైద్యం మీదా పెట్టిన ఖర్చుకు తిరిగి రాబడి (returns) ఏదీ లేదు అనుకొనేవారు సంతోషిస్తారు కదా!

అందుచేత ఎవరైనా వెయ్యి సంవత్సరాలు, 6000 వేల సంవత్సరాలు, అంతకంటె ఎక్కువ సంవత్సరాలు జీవించా రని గాని, అతడు తాటి చెట్టులా ఉన్నా డని గాని అంటే ఇవన్నీ అర్థవాద లని గ్రహించాలి.

ఏకలవ్యుడు ద్రోణాచార్యునికి బొటనవ్రేలు ఇచ్చివేసి నప్పుడు గురువు అడిగినది ఇచ్చాను కదా అని అతడు సంతోషించాడు. అర్జునునికి తానిచ్చిన మాట నిలబెట్టుకొన్నా నని ఇతడు సంతోషించాడు. అవన్నీ కొన్ని వేల సంవత్సరాల క్రితం జరిగిన, ఆ నాటి సాంఘికపరిస్థితులను బట్టి జరిగిన, ఆ కాలానికే చెందిన రచయిత ఏమీ దాపరికం లేకుండా, యథాతథంగా గ్రంథస్థం చేసిన విషయాలు. వాటిని గూర్చి మనం ఇప్పుడు గుణదోషోద్ఘాటనంతో వివాదాలకు దిగడం హాస్యాస్పదం. దొంగసర్టిఫికెట్టుతో వైద్యవిద్య పూర్తి చేసికొని, రోజుకు ఐదు ఆసుపత్రులు సందర్శించి యాభై వేలు సంపాదిస్తూన్న ఒక వైద్యుని విషయం తెలిసి వాని వైద్యవిద్యాప్రమాణపత్రం రద్దు చేయడంవంటిదే ఇదీని.

ఈ చర్చలతో విపరీతభావాల ప్రచారం చేయకుండా మనకు ఈనాటికి కూడా ఉపయోగించే, ఈ గ్రంథాలలోని ఉత్తమవిషయాలను గ్రహిస్తే మనం ఎంతో లాభం పొందినవాళ్లం అవుతాం.

నిజానికి భారతీయు లందరూ కొన్ని వేల సంవత్సరాలపాటు ఈ విధమైన దృక్పథంతో ఈ గ్రంథాలలోని విషయాలు గ్రహించి, స్వామి వివేకానంద చెప్పినట్లు, బాహ్యాడంబరా లేవీ లేని మానసికశాంతిభరితా లైన జీవనాలు గడిపారు.

## 5

అయితే కొందరు సనాతనధర్మదూరులు చేసిన నిరంతరప్రయత్నాల ఫలితంగా భారతీయుల దృక్పథంలో కూడ చాల మార్పు వచ్చింది. పని కట్టుకొని ప్రాథమిక

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Mahabharatasarasangrahamu**

* * *